TGTEL/26/A6780

# స్పందన

తెలుగు దినపత్రిక

సంపుటి :01 | సంచిక :30 | పేజీలు 8 | వెల : 5

శనివారం 17 అక్టోబర్ 2026

విలేకరులు కావలెను

జర్నలిస్టులే యాజమాన్యంగా నడపబడుతూ ప్రజా గొంతుకై అనతికాలంలోనే ప్రభంజనం సృష్టిస్తున్న స్పందన దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.ఆసక్తి ఉన్న వార

ఈ క్రింది నెంబర్లలలో సంప్రదించండి

9440657806,9440697806



## జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో

# పరిశోధన కేంద్రం

### 678 ఎకరాల్లో సమీకృత అంతర్జాతీయ పరిశోధన కేంద్రం

### 4,276 మందికి ఉపాధి అవకాశాలు: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



హైదరాబాద్, అక్టోబర్ 16 : తెలంగాణలో కార్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హ్యుందాయ్ సంస్థకు ఆహ్వానం పలికారు. హైదరాబాద్‌కు ఉన్న వ్యూహాత్మక భౌగోళిక స్థానం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన జీవన ప్రమాణాలు రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనుకూలమైన గమ్యస్థానంగా నిలుపుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్‌యోన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రితో సమావేశమైంది. తెలంగాణలో పారిశ్రామిక పెట్టుబడులను పెంచడం, ఆటోమొబైల్ రంగాన్ని విస్తరించడం, కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడం (మిగతా 2వ పేజీలో)

## సింగరేణి స్కామ్‌లపై

# విచారణకు రెడీ

### తెలంగాణకు వెలుగులు పంచిన సింగరేణిని బదనాం చేస్తున్నారు



### సర్కార్ నిర్వాకంతోనే జలగండం

### రేవంత్‌రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 16 : సింగరేణి సంస్థలో స్కామ్‌లపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. జడ్జికి రేవంత్‌రెడ్డి లేఖ రాస్తే తాను పూర్తి ఆధారాలు సమర్పిస్తానని తేల్చిచెప్పారు. 'బొగ్గు అంశంలోనే కాదు.. నువ్వు చేసిన అక్రమాలు, నీ బామ్మర్ది సృజన్‌రెడ్డి సింగరేణిలో కొల్లగొట్టిన రూ. 10 వేల కోట్ల కుంభకోణం, నువ్వు చేసిన పవర్ స్కామ్, విదేశీ బొగ్గు కొనుగోలు పేరిట సాగుతున్న కమీషన్ల బాగోతాన్ని కూడా బయటపెట్టేందుకు సిద్ధం' అని ప్రకటించారు. 'సింగరేణి నిండా కుంభకోణాలున్నాయని మొన్న లేఖ రాసిన.. అంతకుముందు రోజు బహిరంగ సభలో బయటపెట్టిన.. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొన్న అడ్డగోలుగా మాట్లాడి స్కామ్‌లను కప్పిపుచ్చుకొనేందుకు యత్నించారు' అని -మిగతా 2 లో..

## యాదాద్రి పవర్‌ప్లాంటుకు

# బొగ్గు ఇస్తాం

### రాహుల్ వంటి బాధ్యత లేని ప్రతిపక్ష నేతను చూడలేదు

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 16 : ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలోని యాదాద్రి పవర్ ప్లాంటుకు బొగ్గు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి తనను అడిగారని.. యాదాద్రిలో విద్యుదుత్పత్తికి అంతరాయం లేకుండా బొగ్గు సరఫరా చేస్తామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాహుల్ వంటి బాధ్యతలేని -మిగతా 2 లో..




## రైతు కూలీలకు రూ.12 వేల

# హామీ నెరవేర్చాలి

### కల్వకుంట్ల కవిత డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 16 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా రైతు కూలీలకు ఏటా రూ.12 వేలను ఈ కష్టకాలంలోనైనా అందించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కరవు పరిస్థితుల్లో ఉపాధి పనుల కోసం దూరప్రాంతాలకు -మిగతా 2 లో..



# వ్యాపారులకు భారీ నష్టం

### కన్నాట్ ప్లేస్ మూసివేతతో రోజుకు రూ.200 కోట్ల నష్టం?

### వ్యాపారుల పిటిషన్‌పై తక్షణ విచారణకు సుప్రీంకోర్టు నిరాకరణ

### చిన్న వ్యాపారుల జీవనోపాధిపై ధర్మాసనం ఆందోళన

### ఆంక్షలు చట్టవిరుద్ధమైతే పరిహారం ఇప్పిస్తామని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 16 :

ఢిల్లీలోని ప్రముఖ వాణిజ్య ప్రాంతం కన్నాట్ ప్లేస్‌లో నిరసన కార్యక్రమం నేపథ్యంలో సెంట్రల్ పార్కును మూసివేయడంపై వివాదం నెలకొంది. కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతిపాదించిన 'లెహ్రో దో తిరంగా' నిరసన కార్యక్రమం కారణంగా పార్కును మూసివేయడాన్ని వ్యతిరేకిస్తూ వ్యాపార సంఘాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఈ మూసివేత వల్ల తమ వ్యాపార కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, రోజుకు సుమారు రూ.200 కోట్ల మేర నష్టం వాటిల్లుతోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా పండగల సమయంలో వినియోగదారుల రాకపోకలు తగ్గిపోవడం, వ్యాపార లావాదేవీలు నిలిచిపోవడం వల్ల చిన్న దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొంటున్నారు. ఢిల్లీ కిరాణా కమిటీ, ఢిల్లీ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్ అసోసియేషన్ తరఫున న్యాయవాది జై అనంత్ దేహద్రాయ్ ఈ అంశాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తి (మిగతా 2వ పేజీలో)

## పట్టభద్రుల ఓటరు నమోదుపై

# కాంగ్రెస్ దృష్టి

### గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధత సమావేశం

### నేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం

### బూత్ స్థాయి నుంచి ఓటరు నమోదుకు కార్యాచరణ



హైదరాబాద్, అక్టోబర్ 16 : రానున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఓటరు నమోదు, అర్హులైన పట్టభద్రులను గుర్తించడం, క్షేత్రస్థాయి లో పార్టీ శ్రేణుల సమన్వయం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఎన్నికలకు ముందుగానే (మిగతా 2వ పేజీలో)



## సద్దుల బతుకమ్మకు

# గవర్నర్‌కు ఆహ్వానం

### లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో జావళి భేటీ



## బతుకమ్మ యువ దర్శకుల

# పోటీలకు పురస్కారాలు

### అవార్డుల కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

బతుకమ్మ యువ చిత్ర నిర్మాతల సవాలు-2026 పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్ దిల్‌రాజు ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసి కార్యక్రమానికి హాజరుకావాలని కోరింది. యువ చిత్ర నిర్మాతలను ప్రోత్సహించడంతో పాటు బతుకమ్మ పండుగ విశిష్టతను చలనచిత్రాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను బృందం ముఖ్యమంత్రికి తెలియజేసింది.

హైదరాబాద్, అక్టోబర్ 16 :

బతుకమ్మ యువ చిత్ర నిర్మాతల సవాలు-2026లో భాగంగా నిర్వహిస్తున్న పురస్కారాల ప్రదానోత్సవం ఈ నెల 17న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తూ దిల్‌రాజు ప్రతినిధి బృందం ప్రత్యేకంగా సమావేశమైంది. యువ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, కార్యక్రమ ఉద్దేశాన్ని ముఖ్యమంత్రికి వివరించినట్లు సమాచారం. ముఖ్యమంత్రిని కలిసి పురస్కారాల ప్రదానోత్సవానికి ఆహ్వానించిన ప్రతినిధి బృందంలో సినీ, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు ఉండటంతో ఈ కార్యక్రమానికి ప్రాధాన్యం ఏర్పడింది. యువ చిత్ర నిర్మాతలను ప్రోత్సహించే ప్రయత్నంలో భాగంగా ఈ ఆహ్వాన కార్యక్రమం నిర్వహించారు. (మిగతా 2వ పేజీలో)

స్పందన
తెలుగు దినపత్రిక

# నేటి రాశి ఫలాలు

**మేషం:** దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించాలి. తల్లి తరపు బంధు వర్గంతో వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

**వృషభం:** అన్నివైపుల నుండి ఆదాయం అందుతుంది. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.ఇంటా బయట సంతోషకర వాతావరణం ఉంటుంది. సోదరులతో సఖ్యత కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

**మిథునం:** అనవసర వస్తువులపై ధన వ్యయం చేస్తారు. గృహమున కొందరి ప్రవర్తన మానసిక ఆందోళన కలిగిస్తుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో సరైన నిర్ణయం తీసుకోలేరు. ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

**కర్కాటకం:** ఉద్యోగమున నూతన అవకాశములు అందుతాయి. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. వృత్తి వ్యాపారాలలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటారు. నిరుద్యోగుల కష్టం ఫలించి నూతన అవకాశాలు అందుతాయి. ఇంటా బయట మంచి మాట తీరుతో అందరినీ ఆకట్టుకుంటారు. ఆర్థిక పరిస్థితి ఆశించిన రీతిలో ఉంటుంది.

**సింహం:** భాగస్వామ్య వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి ఉద్యోగాలలో మీ శ్రమకు తగిన గుర్తింపు లభించదు. ఆర్థికంగా కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

**కన్య:** కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. ఋణ సమస్యల నుండి బయటపడతారు. వృత్తి, ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నూతన కార్యక్రమాల ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి.

**తుల:** పాత ఋణాలు తీర్చగలుగుతారు. బంధు మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులలో అవరోధాలు ఉన్నప్పటికీ నిదానంగా పూర్తిచేస్తారు. ఆదాయ మార్గాలు మెరుగుపడతాయి.

**వృశ్చికం:** వృత్తి ఉద్యోగాలలో మేలైన సౌకర్యాలను పొందుతారు. సమాజంలో కీర్తి గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. సంతానం విద్యా విషయాలపై కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు.

**ధనస్సు:** బంధు మిత్రులతో చిన్నపాటి మాటపట్టింపులు ఉంటాయి. శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇతరులపై మీ ఆలోచనా విధానం మార్చుకోవడం మంచిది. అనుకున్న సమయానికి పనులు పూర్తికావు.

**మకరం:** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. భూ క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుతాయి. బంధుమిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగాలలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**కుంభం:** ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. వ్యాపార వ్యవహారాలలో పెద్దల సలహాలను తీసుకుని ముందుకు సాగడం మంచిది. సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

**మీనం:** దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. పనులు మధ్యలో నిలిచిపోతాయి. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. ధన విషయాలలో ఇతరులకు మాట ఇవ్వడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది.



# పట్టభద్రుల ఓటరు నమోదుపై కాంగ్రెస్ దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టేందుకు నాయకులు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పట్టభద్రులందరికీ ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తూ అర్హులైన వారు తమ పేర్లను నమోదు చేసుకునేలా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి ఏఐసీసీ ఇన్‌ఛార్జి కార్యదర్శి సచిన్ సావంత్, డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్, దీపక్ జాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ హాజరయ్యారు. వీరితో పాటు 15 నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, పీసీసీ సమన్వయకర్తలు పాల్గొన్నారు. పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి పార్టీ తరఫున చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులు చర్చించారు. నియోజకవర్గాల వారీగా అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదును వేగవంతం చేయడంపై దృష్టి సారించారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించడం కీలకమని సమావేశంలో పేర్కొన్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పట్టభద్రుల వివరాలను సేకరించాలని సూచించారు. ఓటరు నమోదుకు అవసరమైన సమాచారాన్ని అర్హులకు చేరవేయడంతో పాటు, నమోదు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు తమ పరిధిలోని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 2023 అక్టోబర్ 31కి ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులని సమావేశంలో వివరించారు. ఈ నేపథ్యంలో అర్హత కలిగిన పట్టభద్రులను బూత్ స్థాయి నుంచే గుర్తించి, వారి పేర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా పార్టీ నాయకులు చురుకుగా పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. పట్టభద్రుల వివరాలను సేకరించి, అర్హతలను పరిశీలించి, నమోదు ప్రక్రియకు అవసరమైన సహకారం అందించాలని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందుగానే ఈ ప్రక్రియను విస్తృతంగా చేపట్టడం ద్వారా అర్హులైన ఓటర్ల నమోదు పెంచేందుకు కృషి చేయాలని అన్నారు. పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల సన్నద్ధతలో భాగంగా పార్టీ నాయకులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, పీసీసీ సమన్వయకర్తలు సమష్టిగా పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఓటరు నమోదు విషయంలో బూత్ స్థాయి నుంచి సమన్వయం పెంచుకుని, అర్హులైన పట్టభద్రులకు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. గాంధీభవన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణ, పట్టభద్రుల గుర్తింపు, ఓటరు నమోదును విస్తృతం చేసే చర్యలపై చర్చించారు.

# ఢిల్లీ బంద్‌తో వ్యాపారులకు భారీ నష్టం

(మొదటి పేజీ తరువాయి)

జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ముందు అత్యవసర విచారణ కోరారు. న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ అర్ధరాత్రి వేళ పార్కును మూసివేయాలని ఆదేశాలు జారీ చేసిందని, ఈ నిర్ణయం వల్ల వ్యాపారాలు నిర్వహించుకోవడం కష్టంగా మారిందని న్యాయవాది వివరించారు. పండగల సమయంలో వ్యాపారులకు సాధారణంగా ఎక్కువ ఆదాయం లభిస్తుందని, ఇలాంటి కీలక సమయంలో ఆంక్షలు విధించడం వల్ల వారి ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడుతుందని కోర్టుకు తెలిపారు. వ్యాపారుల వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో సంబంధిత వర్గాలన్నింటిలోనూ మంచి ఆలోచన కలగాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. పండగల సమయంలో చిన్న దుకాణదారులు తమ కుటుంబాల జీవనోపాధి కోసం ఎంతగా శ్రమిస్తారో న్యాయస్థానానికి తెలుసని, వారు ఎదుర్కొనే కష్టాలు, ఇబ్బందులను అర్థం చేసుకోగలమని వ్యాఖ్యానించారు. అయితే, వ్యాపారుల పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు ధర్మాసనం నిరాకరించింది. నిరసన కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించేటప్పుడు ప్రజల హక్కులు, వ్యాపార కార్యకలాపాలు, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని ఈ సందర్భంగా స్పష్టమైంది. న్యాయమూర్తి జాయ్‌మాల్యా బాగ్చీ స్పందిస్తూ నిరసన తెలిపే హక్కు శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత, స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే హక్కు పరస్పరం ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. ఒక వర్గానికి కల్పించిన హక్కును అమలు చేసే క్రమంలో మరో వర్గం హక్కులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన అవసరం ఉందనే విషయాన్ని ఆయన వ్యాఖ్యలు సూచించాయి. ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు విధించిన ఆంక్షలు అహేతుకమైనవని, వాటి కారణంగా వ్యాపారులకు చట్టవిరుద్ధంగా నష్టం వాటిల్లిందని విచారణలో తేలితే, రాజ్యాంగం కల్పించిన అధికారాలను ఉపయోగించి నష్టపరిహారం ఇప్పించే అవకాశం న్యాయస్థానానికి ఉందని వివరించారు.

# జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్

మొదటి పేజీ తరువాయి

ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన.. తెలంగాణలోనూ బీజేపీతో కలిసి ముందుకు సాగుతుందా? అన్న ప్రశ్న రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో జనసేన ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించడంతో పాటు ప్రచార రథాన్ని కూడా ప్రారంభించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదే సమయంలో తెలంగాణ బీజేపీ రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. జనసేనతో పొత్తుల అంశాన్ని పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు గతంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ఈ ఎన్నికల్లో రెండు పార్టీల మధ్య సమన్వయం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. మొత్తంగా చూస్తే, తెలంగాణలో జనసేన బలాన్ని పెంచుకోవడంతో పాటు పట్టభద్రుల్లో తనకు ఉన్న ఆదరణను పరీక్షించుకోవాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి. అభ్యర్థిని ముందుగానే ప్రకటించడం, ప్రచార వాహనాన్ని రంగంలోకి దించడం ద్వారా ఎన్నికల సన్నద్ధతపై పార్టీ స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. అయితే బీజేపీతో పొత్తు ఉంటుందా, జనసేన స్వతంత్రంగానే పోటీ చేస్తుందా అన్న అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగం, ఉద్యోగ అవకాశాలు, విద్యావంతుల ఆకాంక్షలను ఏ పార్టీ సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్తుందన్నది కూడా కీలకం కానుంది. ఈ నేపథ్యంలో జనసేన ప్రచార వ్యూహం, బీజేపీ వైఖరి, అభ్యర్థి గడాల శ్రీనివాసరావుకు లభించే మద్దతు.. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయంగా ఆసక్తి రేపనున్నాయి.

# తెలంగాణలో కార్ల తయారీకి హ్యుందాయ్‌కు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

వంటి అంశాలపై ఈ భేటీలో చర్చించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని జాతీయ పెట్టుబడులు, తయారీ మండలి పరిధిలో సమీకృత అంతర్జాతీయ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు హ్యుందాయ్ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు రూ.8,528 కోట్ల పెట్టుబడి అవసరమవుతుందని, మొత్తం 678 ఎకరాల విస్తీర్ణంలో దీనిని అభివృద్ధి చేయాలని యోచిస్తున్నట్లు వివరించారు. ఈ కేంద్రం ఏర్పాటుతో 4,276 మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన పనులు ప్రారంభించేందుకు రానున్న నెల్లోనే భూమిపూజకు సిద్ధమయ్యే అవకాశముందని సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ ప్రతిపాదిత ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హ్యుందాయ్ సంస్థకు హైదరాబాద్‌తో ఇప్పటికే దీర్ఘకాల సంబంధం ఉంది. నగరంలోని హైటెక్ సిటీలో ఉన్న సంస్థ పరిశోధన, అభివృద్ధి కేంద్రం దాదాపు రెండు దశాబ్దాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ కేంద్రం ద్వారా సాంకేతిక పరిశోధన, ఇంజినీరింగ్ సేవలకు హైదరాబాద్ ప్రాధాన్య కేంద్రంగా ఎదిగింది. ఈ నేపథ్యంలో నగరాన్ని ప్రపంచస్థాయి సాంకేతికత, అధునాతన ఇంజినీరింగ్ కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలనే సంస్థ ప్రణాళికలకు తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలు అనుగుణంగా ఉన్నాయని ప్రతినిధి బృందం పేర్కొంది. పరిశోధన రంగంలో ఇప్పటికే ఉన్న సామర్థ్యాలను మరింత విస్తరించడం ద్వారా రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు లభించే వీలుంది. తెలంగాణలో ఆటోమొబైల్ రంగానికి అనుకూలమైన ప్రత్యేక పారిశ్రామిక సమూహాలు, బహుళ రవాణా అనుసంధాన సదుపాయాలు, అభివృద్ధి చెందుతున్న తయారీ కారిడార్లు ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. పట్టణ పరిసర ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికతో పాటు పరిశ్రమలకు అవసరమైన రవాణా, మౌలిక వసతులను సమన్వయంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పెట్టుబడిదారులకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఇతర సహకారాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోనే కీలక తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. ఈ అవకాశాలను వినియోగించుకుని హ్యుందాయ్ వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో తమ కార్యకలాపాలను విస్తరించాలని కోరారు. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో నిర్వహించనున్న పెట్టుబడుల సదస్సు-2026లో పాల్గొనాలని ముఖ్యమంత్రి హ్యుందాయ్ ప్రతినిధులను ఆహ్వానించారు. అలాగే భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికను వివరించారు. తెలంగాణ రైజింగ్-2047 దార్శనికతకు అనుగుణంగా హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి సాంకేతిక, పరిశోధన, తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# ..పోటీలకు పురస్కారాలు

(మొదటి పేజీ తరువాయి)

బతుకమ్మ యువ చిత్ర నిర్మాతల సవాలు ద్వారా యువతలోని సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు తెలంగాణ పండుగలు, సంస్కృతి, సంప్రదాయాలను చిత్రాల ద్వారా ప్రజలకు పరిచయం చేసే అవకాశం కల్పిస్తున్నారు. బతుకమ్మ పండుగ నేపథ్యంలో రూపొందించిన చిత్రాల ద్వారా స్థానిక సంస్కృతిని కొత్త తరానికి చేరువ చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిలుస్తోంది. ఈ పోటీలో పాల్గొన్న ప్రతిభావంతులకు పురస్కారాల ప్రదానం ద్వారా ప్రోత్సాహం అందించనున్నారు. ఈ నెల 17న జరగనున్న వేడుకలో విజేతలకు అవార్డులు అందజేయనున్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఈ నెల 17న జరగనున్న పురస్కారాల ప్రదానోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

## తెలంగాణ క్రీడాకారుల ప్రతిభ

**హైదరాబాద్, అక్టోబర్ 16 :**

మేడ్చల్ జిల్లాకు చెందిన కట్టెకోల భవజ్ఞ బాలికల విభాగంలో కాంస్య పతకం సాధించి తెలంగాణకు గుర్తింపు తీసుకొచ్చింది. జాతీయస్థాయిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులతో పోటీపడి పతకం సాధించడం ఆమె కృషికి నిదర్శనంగా నిలిచింది. యోగాసనాల్లో శరీర సమతుల్యత, ఏకాగ్రత, శారీరక దృఢత్వం, నిరంతర సాధన ఎంతో అవసరం. ఈ అంశాల్లో ప్రతిభ కనబరిచిన భవజ్ఞ తన ప్రదర్శనతో ప్రశంసలు అందుకుంది. ఆమె సాధించిన విజయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎన్. వాసవి, కరీంనగర్ జిల్లాకు చెందిన పి. దీపక్ కూడా జాతీయస్థాయి యోగాసన పోటీల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. వీరిద్దరూ తమ తమ విభాగాల్లో ఐదో స్థానాలు సాధించారు. పతకాలు సాధించకపోయినా జాతీయస్థాయిలో పోటీపడి మెరుగైన స్థానాలు పొందడం అభినందనీయమని క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి.

# సద్దుల బతుకమ్మకు గవర్నర్‌కు ఆహ్వానం

**లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో జూపల్లి భేటీ**

**ఈ నెల 18న వేడుకలకు ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానం**

**రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా సద్దుల బతుకమ్మ**

**ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన గవర్నర్**

**హైదరాబాద్, అక్టోబర్ 16 :**

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 18న ఆదివారం ఘనంగా నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సద్దుల బతుకమ్మ వేడుకలకు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ, కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. లోక్‌భవన్‌లో జరిగిన సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వానం అందజేశారు. ఈ నెల 18న నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేయాలని కోరారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రత్యేక స్థానం కలిగి ఉందని, పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా జరుపుకునే ఈ వేడుకలకు విశేష ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి గవర్నర్‌ను ఆహ్వానించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొంటారు. పండుగలో భాగంగా నిర్వహించే సద్దుల బతుకమ్మకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. ఈ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18న ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ వేడుకకు గవర్నర్ హాజరుకావాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. మంత్రి జూపల్లి కృష్ణారావు అందించిన ఆహ్వానంపై గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సానుకూలంగా స్పందించారు. ఆహ్వానాన్ని సానుకూలంగా స్వీకరించినందుకు మంత్రి గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపారు. లోక్‌భవన్‌లో జరిగిన ఈ సమావేశం మర్యాదపూర్వకంగా సాగింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే సాంస్కృతిక వేడుకలో గవర్నర్ పాల్గొనాలని కోరుతూ మంత్రి ఆహ్వానం అందజేశారు. ఈ విషయాన్ని మంత్రి సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. ఈ నెల 18న ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పే ఈ వేడుకలకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ముఖ్య అతిథిగా ఆహ్వానించడం కార్యక్రమంలో భాగంగా నిలిచింది. లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన మంత్రి జూపల్లి కృష్ణారావు ఆహ్వానం అందజేసి, ఆయన సానుకూల స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకలపై ఆసక్తి నెలకొంది.

స్పందన తెలుగు దినపత్రిక

# తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి

## ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రజల భాగస్వామ్యం కీలకం

## రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్



**గుమ్మడిదల, అక్టోబర్ 16(స్పందన):**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి వాణి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నీటి సంరక్షణకు ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. శుక్రవారం గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో అదనపు కలెక్టర్ టి.ఎల్. సంగీతతో కలిసి వాణి ప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామంలో సాగవుతున్న పత్తి, కంది, టమాట పంటలను పరిశీలించి, రైతు బాల్‌రెడ్డితో మాట్లాడి పంటల పరిస్థితి, నీటి లభ్యత, సాగు వివరాలను తెలుసుకున్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు. ప్రతి రైతు పొలంలో ఫామ్ పాండ్స్ నిర్మించుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు తెలిపారు. అనంతరం గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుత పంటల పరిస్థితి, వర్షపాతం, తాగునీటి వనరులు, విద్యుత్ సరఫరా, పశుగ్రాసం లభ్యత, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వాణి ప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలు చేతికొచ్చే వరకు వాటిని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే యాసంగి సీజన్‌లో నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితిని అంచనా వేసిన తర్వాతే పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోకుండా వరి సాగు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని స్పష్టం చేశారు. గ్రామాలవారీగా తాగునీటి అవసరాలను గుర్తించి, నీటి సమస్యలు తలెత్తే ప్రాంతాల్లో ముందస్తు పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నీటి వృథాను అరికట్టి, అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకునేలా వాటర్ రిసోర్సెస్ కమిటీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాబోయే 10--15 రోజులు పంటల రక్షణకు కీలకమని పేర్కొంటూ, అవసరమైన ప్రాంతాల్లో వ్యవసాయానికి తగిన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు ప్రతి వారం సంయుక్త సమీక్ష నిర్వహించాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో పశుగ్రాస కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల అదనపు కలెక్టర్లు సంగీత, లక్ష్మి కిరణ్‌తో పాటు వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు, సంగారెడ్డి ఆర్డీఓ, గుమ్మడిదల తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.





## సద్దుల బతుకమ్మ ఏర్పాట్లలో అపశ్రుతి.. కుంటలో పడిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్!

మరవెల్లిలో శుభ్రత పనులు చేస్తుండగా ఘటన.. డ్రైవర్ సురక్షితం

**వట్పల్లి, అక్టోబర్ 16 (స్పందన)**

వట్పల్లి మండలం మరవెల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. బతుకమ్మల నిమజ్జనం కోసం కుంటలోకి నీటిని వదిలిన గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళలు బతుకమ్మలను కుంటలోకి తీసుకెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శుభ్రత పనులు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ పొరపాటు కారణంగా ట్రాక్టర్ పల్టీ కొట్టి కుంటలో పడిపోయింది. అయితే ఈ ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని గ్రామంలో మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను సిద్ధం చేసుకొని నిమజ్జనానికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కుంట వద్ద శుభ్రత పనులు నిర్వహిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పండుగ వేళ ట్రాక్టర్ కుంటలో పడిపోవడంతో స్థానికులు ఈ ఘటనపై చర్చించుకున్నారు. "పండుగల సందర్భంగా ప్రజలకు సౌకర్యాలు కల్పించడం ఎంత ముఖ్యమో, పనులు నిర్వహించే సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించడం కూడా అంతే ముఖ్యం. చిన్నపాటి నిర్లక్ష్యం ప్రమాదాలకు దారితీయవచ్చు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి"లిలి అని పలువురు అభిప్రాయపడుతున్నారు. డ్రైవర్ సురక్షితంగా ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. గ్రామ పంచాయతీ సిబ్బంది భవిష్యత్తులో ఇలాంటి పనులు చేపట్టేటప్పుడు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని గ్రామస్తులు సూచిస్తున్నారు.

# బతుకమ్మ ఉత్సవాలకు సిద్ధమవుతున్న మహబూబ్ సాగర్ చెరువు కట్ట





**- ఏర్పాట్లు పర్యవేక్షించిన టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**సంగారెడ్డి,అక్టోబర్ 16(స్పందన)**

సంగారెడ్డి పట్టణంలోని కింది బజార్ మహబూబ్‌సాగర్ చెరువు కట్ట బతుకమ్మ వేడుకలకు ముస్తాబవుతోంది. పండుగను ఘనంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్ పరిశీలించారు. చెరువు కట్టపై విద్యుద్దీపాలంకరణ, బారికేడ్ల ఏర్పాటు, బతుకమ్మ నిమజ్జన ఘాట్ల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈసారి వేడుకల్లో 32 అడుగుల భారీ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దీని తయారీకి 16 టన్నుల స్టీల్, అలంకరణకు ఎనిమిది టన్నుల పూలను వినియోగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిమజ్జనం కోసం రెండు ఘాట్లను సిద్ధం చేస్తున్నారు. ఘాట్ల మెట్లకు రంగులు వేస్తున్నారు. వినాయక నిమజ్జన అవశేషాలను పూర్తిగా తొలగించినట్లు మున్సిపల్ సిబ్బంది వివరించారు. వేడుకల కోసం ఐదు డీజే పాయింట్లు, ఘాట్ల వద్ద ఐదు లైటింగ్ టవర్లతో పాటు మొత్తం 18 లైటింగ్ టవర్లను ఏర్పాటు చేస్తున్నారు. 32 అడుగుల తెర, లేజర్ లైటింగ్, చెరువు కట్ట చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. పండుగకు వచ్చే మహిళలు, భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంగుల రవి, కూన సంతోష్,

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

**రేజింతల్‌లో బతుకమ్మ ఘాట్ ప్రారంభం**

సదాశివపేట మండలం రేజింతల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బతుకమ్మ ఘాట్‌ను గురువారం నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిద్దన్న, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ గడీల ఆశిరెడ్డి, నందికంది సర్పంచ్ విజయ్ భాస్కర్‌రెడ్డి, ఇశ్రితబాద్ సర్పంచ్ అనితా శ్రీనివాస్, మండల నాయకులు పాల్గొన్నారు.

# మోదీకి వ్యతిరేకంగా విద్రోహ శక్తుల కుట్రలు

**హైదరాబాద్, అక్టోబర్ 16 :**

శ్రీలంకలో ప్రభుత్వాన్ని కూల్చిన మాదిరిగానే భారత్‌లోనూ ఎన్డీయే ప్రభుత్వాన్ని కూల్చేస్తామని రాహుల్ గాంధీ దింపుడు కళ్లం ఆశలు పెట్టుకుంటున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ.. నీకు దమ్ముంటే ప్రజాదరణతో ఎన్నికైన మోదీ ప్రభుత్వాన్ని పడగొట్టి చూడు అంటూ తీవ్రంగా హెచ్చరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల నిర్వహణ యావత్ ప్రపంచానికే ఆదర్శమని స్పష్టం చేశారు. అమెరికా వంటి అగ్రరాజ్యాల్లో ఎన్నికల ప్రక్రియ, కౌంటింగ్ నెలలతరబడి సాగుతుందని, కానీ మన దేశంలో 140 కోట్ల మంది ప్రజల అభీష్టాన్ని నిష్పక్షపాతంగా ఒక్క రోజులోనే తీర్పు వెల్లడించే అద్భుతమైన స్వతంత్ర వ్యవస్థ ఎన్నికల కమిషన్‌దని గుర్తు చేశారు. అలాంటి ఎన్నికల కమిషన్‌పై బురద చల్లేందుకు రాహుల్ నిరంతరం యత్నిస్తున్నారని మండిపడ్డారు. దేశ భద్రతను కాపాడుతూ దేశ ప్రజల, యువత హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను రాజకీయాల్లోకి లాగడం అత్యంత దుర్మార్గమని కిషన్ రెడ్డి ఖండించారు. రాహుల్ వ్యవహారశైలి అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉందని ఆయన విమర్శించారు. ఉన్నతాధికారులు తనకు టచ్‌లో ఉండి సమాచారం లీక్ చేస్తున్నారని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదమన్నారు. సాధారణంగా ప్రతిపక్ష నాయకుడు అధికారులతో సత్సంబంధాలు పెంచుకోవడం గౌరవప్రదమని, కానీ ప్రభుత్వ అధికారులతో మాట్లాడే సంస్కృతి, సోయి రాహుల్‌కు లేవని దుయ్యబట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి ఇంత బాధ్యతారాహిత్యమైన, బలహీనమైన ప్రతిపక్ష నేతను దేశం ఎన్నడూ చూడలేదని విమర్శించారు. నాడు వాజ్‌పేయి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు కాంగ్రెస్‌తో విభేదాలు ఉన్నప్పటికీ దేశ ప్రయోజనాల కోసం పీవీ నరసింహారావు ప్రభుత్వ హయాంలో ఐక్యరాజ్య సమితిలో భారత ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన సంప్రదాయాన్ని గుర్తు చేశారు. చరిత్ర చదివి ఇలాంటి విలువలు నేర్చుకోవాలని రాహుల్‌కు హితవు పలికారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను బెదిరిస్తూ రాహుల్ దాదాగిరి భాష మాట్లాడుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. 'ప్రజలు మీకు వోట్లు వేయకపోతే ఎన్నికల కమిషనర్ బాధ్యుడా? తమిళనాడులోనో, కేరళంలోనో.. ఇలా ఎక్కడైనా బీజేపీ ఓడిపోతే తాము ఇలాగే దాదాగిరి భాష మాట్లాడాలా అని ప్రశ్నించారు. వోట్ల చోరీ ఎక్కడా జరగలేదని, చోరోం కూ జనతా వోట్ నహీ దేరహీ (దొంగలకు ప్రజలు ఓటు వేయడం లేదు) అన్న వాస్తవాన్ని రాహుల్ గ్రహించాలని చురకలంటించారు.

**న్యాయస్థానాలకు ఊరేగింపులు గర్హనీయం**

న్యాయస్థానాల ముందుకు కాంగ్రెస్ నేతలు ఊరేగింపుగా వెళ్లడం అత్యంత గర్హనీయమని అన్నారు. స్వాతంత్ర్య పోరాటం జరిగినప్పుడు కూడా ఎవరూ కోర్టుల ముందు ఊరేగింపులు చేయలేదని, కానీ రాహుల్ గాంధీ ముఖ్యమంత్రులు, ఎంపీలు, పదవులు పోయిన నాయకులను విమానాలు, రైళ్లలో తరలించి సుప్రీంకోర్టుపై ఒత్తిడి తెచ్చేందుకు, న్యాయమూర్తులను బ్లాక్‌మెయిల్ చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ శైలిని ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. బారికేడ్లు ఎక్కి డ్యాన్సులు చేయడం, మహిళా పోలీసులపై దురుసుగా ప్రవర్తించడం, మహిళా కానిస్టేబుల్‌పై ప్రియాంక గాంధీ పిడిగుద్దులు కురిపించడం చూసి దేశ ఆడబిడ్డలు ఛీత్కరించుకుంటున్నారని అన్నారు.

**రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచకాలు**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగడుతూ ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేయాలన్నా, ఫీజు రీయింబర్స్‌మెంట్, జీవో 22ఏ సమస్యలపై పోరాడాలన్నా బీజేపీ కార్యకర్తలను, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని వారంలో ఐదుసార్లు అర్ధరాత్రి ఇళ్లల్లోకి చొరబడి అక్రమంగా నిర్బంధిస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో రైతులు ఏడాదిన్నరపాటు నిరసనలు చేపడితే నీరు, ఆహారం, మరుగుదొడ్లు కల్పించి కేంద్రం ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించిందని గుర్తుచేశారు. ఇక్కడ ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ, బీజేపీ నాయకులు బయటకు రాకుండా గృహ నిర్బంధాలు చేస్తూ ఢిల్లీలో రాజ్యాంగ పరిరక్షణ అంటూ రేవంత్ రెడ్డి ఇచ్చే పెద్ద పెద్ద ఉపన్యాసాలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఆగ్రహించారు. దేశ అభివృద్ధిని, ప్రపంచవ్యాప్తంగా నరేంద్ర మోదీ నాయకత్వంలో పెరుగుతున్న దేశ ప్రతిష్ఠను జీర్ణించుకోలేక అంతర్జాతీయ పెట్టుబడిదారీ శక్తులు, డీప్ స్టేట్ మీడియా, విదేశీ శక్తులు, దేశీయ విద్రోహ శక్తులు ఏకమై కుట్రకు తెరలేపాయని కిషన్ రెడ్డి అన్నారు. యూపీ అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఢిల్లీలో ఒక్క రోజే పది వేల జీన్స్ ప్యాంట్లు, టీషర్టులు విద్యార్థులకు పంపిణీ చేసి అరాచకాలు సృష్టించేందుకు కుట్రలు పన్నారని ఆధారాలతో వివరించారు. ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్, ఐఎల్‌వో వంటి అంతర్జాతీయ సంస్థలన్నీ దేశ జీడీపీ వృద్ధి, ఆర్థిక స్థిరత్వాన్ని వేనోళ్ల కొనియాడుతుంటే కొందరికి కంటగింపుగా మారిందన్నారు. ప్రపంచ శక్తులన్నీ ఏకమైనా నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని వెంట్రుక కూడా పీకలేవని స్పష్టం చేశారు.

**'సర్'పై ప్రాథమిక పరిజ్ఞానం లేని రాహుల్**

'సర్' ప్రక్రియపై రాహుల్ గాంధీకి ప్రాథమిక జ్ఞానం కూడా లేదని కిషన్ రెడ్డి అన్నారు. ఇది ఇప్పుడు మోదీ హయాంలో కొత్తగా వచ్చింది కాదు.. నెహ్రూ, ఇందిర, రాజీవ్, పీవీ నరసింహారావు కాలం నుంచే అమల్లో ఉన్న రాజ్యాంగ ప్రక్రియ అని గుర్తు చేశారు. 2014, 2019, 2024 సాధారణ ఎన్నికల్లో 'సర'తో సంబంధం లేకుండా ప్రజాదరణతోనే మోదీ ప్రభుత్వం పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చిందని స్పష్టం చేశారు. 'సర' ప్రవేశపెట్టకముందే కాంగ్రెస్ లెక్కలేనన్ని రాష్ట్రాల్లో ఘోరంగా ఓడిపోయిందని గుర్తుచేశారు. కేరళంలో సీపీఎం లక్షలాది దొంగ వోట్లను 'సర్ ద్వారా తొలగించడం వల్లే కాంగ్రెస్ గెలిచిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రమేష్ చెన్నితాల ఒప్పుకున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. పొంతన లేకుండా మాట్లాడుతూ వ్యవస్థలను దెబ్బతీసేందుకు యత్నిస్తున్న రాహుల్ గాంధీని, కాంగ్రెస్ పార్టీని కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కేరళం సహా యావత్ దేశ ప్రజలు పూర్తిగా తిరస్కరించడం ఖాయమని ఆయన తేల్చిచెప్పారు.

## కేటీఆర్ లేఖకు రేవంత్ కౌంటర్ అటాక్!

**మొదటిపేజీ తరువాయి**

యాదాద్రిలో మాత్రం రూ.6.60 అవుతోందని ప్రభుత్వం పేర్కొంటోంది.

ఈ లెక్కల ప్రకారం యాదాద్రిలో ఒక్కో యూనిట్‌పై రూ.2.20 అదనపు వ్యయం అవుతోందని, ప్లాంట్ కారణంగా రూ.50 వేల కోట్ల భారం పడుతోందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాబోయే 25 ఏళ్లలో ఈ నష్టం రూ.లక్ష కోట్లకు చేరుతుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొంటూ, ఇందుకు బాధ్యత వహించాల్సిన వారెవరో చెప్పాలని ప్రశ్నించారు. అయితే, ఈ అంచనాలకు సంబంధించిన పూర్తి లెక్కలు, స్వతంత్ర ధ్రువీకరణ వివరాలు ఇక్కడ అందుబాటులో లేవు.

**కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి సరఫరాపైనా ప్రశ్నలు**

మరోవైపు కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లోని అసైన్డ్ భూముల వ్యవహారంపై జరుగుతున్న దర్యాప్తు నేపథ్యంలో, పంచపాండవుల చెరువులకు నీటిని తరలించిన అంశాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. కొండ పోచమ్మ సాగర్ నుంచి చెరువుల్లోకి నీటిని నింపి, అక్కడి నుంచి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించారంటూ ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ఏర్పాటుకు అనుమతులు ఎలా వచ్చాయని, ఫామ్‌హౌస్‌కు ప్రత్యేక పైప్‌లైన్ ఎందుకు వేశారని నిలదీశారు. ఈ అంశంపై నిజనిర్ధారణకు మీడియాను పంపాలా, కమిటీ వేయాలా చెప్పాలని సవాల్ విసిరారు.

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో రైతులు నీటి కొరతను ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తున్న నేపథ్యంలో, ఫామ్‌హౌస్‌కు నీటి సరఫరా అంశాన్ని సీఎం చర్చకు తీసుకురావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వంపై ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలకు పాత ఒప్పందాలు, విద్యుత్ ఉత్పత్తి వ్యయాలు, భూములు, నీటి సరఫరా అంశాలను ప్రస్తావిస్తూ సమాధానం చెప్పే వ్యూహాన్ని అధికార పక్షం అనుసరిస్తున్నట్లు కనిపిస్తోంది.

## జీవన సౌందర్యాన్ని చాటే పండుగ బతుకమ్మ

**హైదరాబాద్, అక్టోబర్ 16 :**

బతుకమ్మ అంటే పూల పండుగ మాత్రమే కాదు.. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రకృతిని పూజిస్తూ పూలను కొలుస్తూ జీవన సౌందర్యాన్ని చాటే పండుగ అని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వం.. ఆడబిడ్డల ఆనందం.. మహిళల ఐక్యత.. ఆత్మీయత కలగలిసిన పండుగ బతుకమ్మ అని చెప్పారు. తంగేడు, గునుగు పూలతో పేర్చే బతుకమ్మలో తెలంగాణ మట్టి పరిమళం ఉంటుందని, ప్రకృతిని ప్రేమించడం.. పర్యావరణాన్ని కాపాడుకోవడం బతుకమ్మ మనకు నేర్పించే గొప్ప సందేశం అని అన్నారు. కులమతాలకు అతీతంగా మహిళలంతా ఒక్కచోట చేరి సంబరాలు చేసుకోవడం బతుకమ్మ ప్రత్యేకత అన్నారు. బతుకమ్మ పాటల్లో తెలంగాణ పల్లె జీవితం.. మహిళల కష్టసుఖాలు.. మన నేల సంస్కృతి ప్రతిధ్వనిస్తాయని తెలిపారు. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ సంప్రదాయాన్ని మన పిల్లలకు అందించడం మనందరి బాధ్యత అన్నారు. మన పండుగలను కాపాడుకోవడం అంటే మన మూలాలను, మన అస్తిత్వాన్ని కాపాడుకోవడమేనని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బతుకమ్మ బతుకు సందేశం ఇస్తుంది.. ఐక్యతను చాటుతుంది.. తెలంగాణ గర్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తుంది అని చెప్పారు.




## కొత్తూరు (కె)లో డివిజన్ స్థాయి భూ రీ-సర్వే శిక్షణ.

భూ సరిహద్దుల పరిశీలన సర్వే వివరాల నమోదుపై అధికారులకు శిక్షణ.

**కోహిర్ అక్టోబర్ 16 (స్పందన)**

కోహిర్ మండల పరిధిలోని కొత్తూరు (కె) గ్రామంలో డివిజన్ స్థాయి క్షేత్రస్థాయి భూముల పున సర్వే (ఫీల్డ్ రీ-సర్వే) శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపడుతున్న రీ సర్వే ప్రక్రియలో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల సర్వే విధానం భూముల సరిహద్దుల పరిశీలన క్షేత్ర స్థాయిలో సర్వే వివరాల నమోదు తదితర అంశాలపై అధికారులకు శిక్షణ అందించారు. రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి డిప్యూటీ తహశీల్దార్లు (డీటీలు)రెవెన్యూ ఇన్స్పెక్టర్లు (ఆర్ఐలు) సీనియర్ అసిస్టెంట్లు కోహిర్ మండల జీపీఓలు పాల్గొన్నారు.



## మణియార్పల్లిలో పింఛన్ల పరిశీలన చేపట్టిన జడ్పీ సీఈఓ జానకి రాంరెడ్డి

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి..
ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవాలని సూచన.

**కోహీర్, అక్టోబర్ 15 (స్పందన)**

మండలంలోని మణియార్పల్లి గ్రామంలో గురువారం జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి జడ్పీ సీఈఓ జానకి రాంరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పింఛన్ లబ్ధిదారుల వివరాలను ర్యాండమ్ పద్ధతిలో పరిశీలించి, పింఛన్ల వెరిఫికేషన్ నిర్వహించారు. అనంతరం గ్రామంలో నీటి సంరక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతంలో అనిశ్చితి, నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతను తప్పనిసరిగా నిర్మించుకోవాలని, తద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మణియార్పల్లి గ్రామంలో ఒక లబ్ధిదారుడి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మాణానికి మార్కింగ్ చేసి, పనులను ప్రారంభించారు. గ్రామంలోని ప్రతి కుటుంబం నీటి సంరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలి



**విద్యుత్ కోతలతో ఎండిపోతున్న పంటలు..**

**ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆందోళన**

**జహీరాబాద్, అక్టోబర్ 16 (స్పందన)**

వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశారని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కోతల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా వరి పంట పొట్ట దశలో ఉన్న సమయంలో నీరు అందించడం అత్యంత కీలకమని, అయితే కొద్ది రోజులుగా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని, రోజంతా కలిపినా ఆరు నుంచి ఏడు గంటలు కూడా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆరోపించారు. సరఫరా చేసే సమయంలోనూ అప్రకటిత కోతలు విధిస్తున్నారని విమర్శించారు. తక్కువ వోల్టేజీ సమస్యతో వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయనిబోర్లు, బావుల కింద సాగు చేస్తున్న పంటలను కాపాడుకోవడం రైతులకు కష్టంగా మారిందని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు జిల్లాలో కొత్తగా ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించిందని, ఎన్ని చెక్‌డ్యామ్‌లు నిర్మించిందని, ఎన్ని చెరువులను అభివృద్ధి చేసిందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. నెట్టెంపాడు ప్రాజెక్టు మోటార్లను 24 గంటలకు బదులుగా ఏడు నుంచి ఎనిమిది గంటలే నడుపుతున్నారని ఆరోపించారు. దీంతో చివరి ఆయకట్టుకు నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని, రైతులు వలసబాట పట్టాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల మోటార్లను సైతం సక్రమంగా నడపడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

**రైతులకు తక్షణ సహాయం అందించాలి**

విద్యుత్ కోతలతో నష్టపోతున్న రైతులకు తక్షణ సహాయం అందించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. కాలిపోయిన వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. విద్యుత్ ఉత్పత్తి, బొగ్గ నిల్వలు,

సరఫరా పరిస్థితిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సూచించారు. విద్యుత్ అధికారులపై చర్యలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ స్థాయిలో జరిగిన ప్రణాళికా లోపాలపై సమీక్ష నిర్వహించాలని అన్నారు. రైతులకు నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు నిర్దిష్ట గడువుతో కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోతే బీఆర్‌ఎస్ పార్టీ తరఫున రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని మాణిక్‌రావు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్, కౌన్సిలర్లు దీపక్, జాకీర్, మహిపాల్ యాదవ్, విశ్వేశ్వర్, నాయకులు చంద్రు, కరణ్ తదితరులు పాల్గొన్నారు.



## వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలి

- తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ
- దసరా సెలవుల్లో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం

**జిన్నారం, అక్టోబర్ 16(స్పందన):**

విద్యార్థులు చదువుతోపాటు వృత్తి విద్యలో నైపుణ్యాలు పెంపొందించుకుని భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, ఒకేషనల్ ట్రైనర్ సంతోషి సూచించారు. బొల్లారం డివిజన్ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు బ్యూటీషియన్ కోర్సుల్లో భాగంగా ఇంటర్న్‌షిప్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దసరా సెలవులను సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులకు ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీదేవి, ఒకేషనల్ ట్రైనర్ సంతోషి తెలిపారు. బాచుపల్లిలోని యశ్విత సెలూన్‌తో పాటు బొల్లారంలోని జారా పార్లర్‌లో విద్యార్థులు శిక్షణ పొందుతున్నట్లు వివరించారు. ఈ శిక్షణలో భాగంగా బ్రైడల్ మేకప్, పార్టీ మేకప్, ఫేషియల్, మెహందీ, మెనిక్యూర్, పెడిక్యూర్, హెయిర్ కట్స్, ఐబ్రోస్ తదితర బ్యూటీషియన్ అంశాల్లో ట్రైనర్ స్రవంతి విద్యార్థులకు ప్రాయోగిక శిక్షణ అందిస్తున్నారు. పుస్తక పరిజ్ఞానంతోపాటు క్షేత్రస్థాయిలో అనుభవం పొందడం ద్వారా వృత్తి నైపుణ్యాలు మెరుగుపడతాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బ్యూటీషియన్ రంగంలో అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవాలని, భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందడంతోపాటు ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, శిక్షకులు పాల్గొన్నారు.

## దసరా పండుగ నేపథ్యంలో పోలీసుల సూచనలు

**జహీరాబాద్ అక్టోబర్ 16 (స్పందన)**

దసరా సెలవుల్లో చాలామంది ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోతుంటారు. దీంతో ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి దొంగలు, దొంగతనాలు చేసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని జహీరాబాద్ రూరల్ ఎస్ ఐ లవకుమార్ అన్నారు. ప్రజల ఇంటికి తాళం వేసి వెళ్లే ముందు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా భారీ నష్టానికి దారి తీయోచన్నారు. అందుకే ప్రయాణానికి ముందే ఇంటి తలుపులు, కిటికీలు సరిగ్గా మూసి ఉన్నాయో లేదో చెక్ చేసుకోవలన్నారు. క్యాష్, గోల్డ్, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను ఇంట్లో వదిలి వెళ్లొద్దు. వీలైతే బ్యాంకు లాకర్లలో ఉంచుకోవలన్నారు మీరు ఊరికి వెళ్తుంటే పొరుగు వారికి చెప్పడం మంచిదన్నారు. అవసరమైతే జహీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వలన్నారు. ఇంట్లో సీసీ టీవీ కెమెరాలు ఉన్నాయా వర్క్ చేస్తున్నాయో లేదో చెక్ చేసు కోవలన్నారు. ఊరికి వెళ్లే ముందు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు. సెలవులలో బయటకు వెలుతున్నప్పుడు సెక్యూరిటి అలారం, మోషన్ సెన్సర్ ను ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ గల తాళము అమర్చుకోవడం మంచిదన్నారు. మీ వాహనాలను మీ ఇంటి ఆవరణ లోనే పార్కు చేసుకో వలన్నారు. మీ




ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా తాళాలు వేసి మీకు వీలైతే చక్రాలకు చైన్స్ తో కూడా లాక్ వేయడం మంచిదన్నారు. నమ్మకమైన వాచ్ మెన్‌లను మాత్రమే సెక్యూరిటి గార్డులుగా నియమించుకోవాలన్నారు. మీ ఇంట్లో అమర్చిన సీసీ కెమెరా ఆన్లైన్ లో ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలన్నారు. మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్స్ పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలన్నారు. వాటిని కూడా గమనించి నేరస్తులు దొంగతనాలకు పాల్పడుతారు. మెయిన్ డోర్ కి తాళం కప్ప వేసినప్పటికి అవి కనిపించకుండా కర్టెన్స్ తో కవర్ చేయడం మంచిదన్నారు. బయటకు వెళ్ళేటప్పుడు ఇంటి లోపల మరియు బయట కొన్ని లైట్లు వేసివుంటే మంచిదన్నారు. మీ ఇంటి దగ్గర మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్ళకు మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తు ఉండమని చెప్పడం మంచిదన్నారు. మీ ఇంటికి వచ్చే, వెళ్ళే దారులు ఇంటి లోపల సీసీ కెమెరాలు అమర్చు కొని డివీర్ కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశం లో ఉంచండన్నారు.

అల్మరా, కప్ బోర్డ్స్ కు సంబంధించిన తాళాలు కామన్ ఏరియా అయిన చెప్పుల స్టాండ్, పరుపులు, దిండ్ల క్రింద, అల్మరా పైన, డ్రెస్సింగ్ టేబుల్ లో, కప్ బోర్డ్స్ లో ఉంచకుండా మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో ఉంచడం మంచిదన్నారు. బంగారు ఆభరణాలు వేసుకొని ఫంక్షన్ లకు గుడికి వెళ్ళేటప్పుడు తగు జాగ్రతలు తీసు కోవలన్నారుసోషల్ మిడియాలో మీరు బయటికి వెళ్ళే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడము మంచిది కాదన్నారు. చైన్ స్నాచింగ్‌లు, టూవీలర్ వాహనాల చోరీలు, ఇళ్లలోకి చొరబడి దొంగతనాలు చేసే ప్రయత్నాలను అడ్డుకునేందుకు పెట్రోలింగ్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో మొబైల్ పెట్రోలింగ్‌తో పాటు బీట్ పోలీసుల ద్వారా మానిటరింగ్ చేస్తున్నారు. అను మానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై వంద దయల్ లేదా జహీరాబాద్ టౌన్ పోలీసు వాట్సాప్ నెంబర్ 8712656763కు సమాచారం ఇవ్వాలన్నారు.



## పూల పండుగతో సందడిగా మారిన జిన్నారం మున్సిపల్ కార్యాలయం

- ఘనంగా దుర్గామాత పూజ.. బతుకమ్మ సంబరాలు!

**జిన్నారం,అక్టోబర్ 16,(స్పందన):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను జిన్నారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ నక్కిర్తి జనార్ధన్, కమిషనర్ నరేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో దుర్గామాత పూజలు నిర్వహించడంతో పాటు మహిళలు బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఏర్పాటు చేసి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దీంతో మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా చైర్మన్ నక్కిర్తి జనార్ధన్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పూల పండుగ బతుకమ్మ మహిళల ఐక్యతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమష్టిగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# కార్మికుల భద్రత గాలికి.. స్టీల్ పరిశ్రమలో ప్రాణం బలి!

**- ఐడీఏ బొల్లారంలో స్టీల్ రాడ్ తగిలి కార్మికుడి మృతి**

**- యాజమాన్య నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమంటున్న కార్మికులు**

**- ఘటనను బయటకు రాకుండా అడ్డుకునే ప్రయత్నం జరిగిందని ఆరోపణలు**

**జిన్నారం, అక్టోబర్ 16 (స్పందన):**

పారిశ్రామికవాడలో కార్మికుల భద్రత మరోసారి ప్రశ్నార్థకంగా మారింది. విధులు నిర్వహిస్తున్న ఓ కార్మికుడు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయిన ఘటన ఐడీఏ బొల్లారంలో విషాదాన్ని నింపింది. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు ఎంతవరకు అమలవుతున్నాయనే ప్రశ్నలను ఈ ఘటన లేవనెత్తింది. జిన్నారం మండలం ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలోని శ్రీకృష్ణ స్టీల్ పరిశ్రమలో గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కార్మికులు, పోలీసుల వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన సద్దాం అన్సారీ (35) పరిశ్రమలో విధులు నిర్వహిస్తుండగా స్టీల్ రాడ్ అతడి తలకు బలంగా తగిలింది. దీంతో తీవ్రంగా గాయపడి కిందపడిపోయిన అతడిని తోటి కార్మికులు వెంటనే పటాన్‌చెరులోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సద్దాం అన్సారీ మృతి చెందాడు. దీంతో పరిశ్రమలో విషాదఛాయలు అలుముకున్నాయి.



**యాజమాన్య నిర్లక్ష్యంపై ఆరోపణలు**

ప్రమాదానికి పరిశ్రమ యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని కార్మికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన విషయాన్ని బయటకు రాకుండా యాజమాన్యం వ్యవహరించిందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది. కార్మికుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారా? ప్రమాదాల నివారణకు తగిన రక్షణ ప్రమాణాలు అమలు చేస్తున్నారా? అనే అంశాలపై చర్చ మొదలైంది. కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఇలాంటి విషాదాలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదానికి ద దారితీసిన పరిస్థితులు, యాజమాన్య బాధ్యతపై విచారణలో స్పష్టత రావాల్సి ఉంది.

## గుక్కెడు మంచినీటి కోసం ప్రజల అగచాట్లు.. స్పందించిన కౌన్సిలర్ మమతా పెంటేష్!

**- గడ్డపోతారం, చెట్లపోతారం ప్రజల తాగునీటి కష్టాలకు చొరవతో చెక్..**

**- పరిశ్రమల సహకారంతో వాటర్ ప్లాంట్లకు నీటి సరఫరా పునరుద్ధరణ**




**జిన్నారం, అక్టోబర్ 16,(స్పందన):**

ఎండల తీవ్రతకు తోడు తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గుక్కెడు మంచినీటి కోసం అల్లాడుతున్న గడ్డపోతారం, చెట్లపోతారం గ్రామాల ప్రజలకు కౌన్సిలర్ మద్దూరి మమతా పెంటేష్ అండగా నిలిచారు. పసిపిల్లలు, వృద్ధులు, రోజువారీ కూలీలు సహా రెండు గ్రామాల ప్రజలు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించి, సమస్య పరిష్కారానికి ఆమె తక్షణమే రంగంలోకి దిగారు. అధికారులతో అత్యవసరంగా చర్చించి, స్థానిక పరిశ్రమల సహకారంతో వాటర్ ప్లాంట్లకు నీటి సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టి ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేక చొరవ చూపారు.

Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780